విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 12 మార్చి 2025 8 పేజీలు



గృహ నిర్మాణాలకు అదనపు సాయం

- ఎస్సీలు, బీసీలకు రూ.50 వేలు ,ఎస్టీలకు రూ.75 వేలు, పివిటిజిలకు లక్ష రూపాయలు
- జిల్లాలో 49,436 మందికి చేకూరనున్న లబ్ధి
- కలెక్టర్ కె.వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ సాకారంలో భాగంగా 2029 నాటికి అందరికీ ఇళు ఏర్పరచాలనే ధృఢ నిశ్చయంతో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఇందులో భాగంగా పీఎంఏవై 1.0 లో ఇల్లు మంజూరై ఇంకా వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్ధిక సహాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉత్తర్వులు జివో నెం.9 తేది 10.03.2025 విడుదల చేసినట్టు తెలిపారు. జిల్లాలో దాదాపు 49,436 వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీల గృహాలు వివిధ దశలలో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. బి.సి.లు 27,150, ఎస్సీలు 18,452, ఎస్టీలు 3,293, పివిటిజిలు(ఆదివాసి గిరిజనులు) 541 మంది, లబ్దిదారులు ఉన్నట్లు గుర్తించినట్టు తెలిపారు. గృహనిర్మాణం పూర్తికి యూనిట్ విలువ రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్సీలు, బీసీలు అందరికీ రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పివిటిజి(ఆదివాసి గిరిజనులకు) లక్ష రూపాయల చొప్పున ఆర్ధిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తుందని తెలిపారు. వీటి నిర్మాణాలను ఏప్రిల్ 2025లోగా పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణం పూర్తి చేసుకొనే దశల వారీగా అదనపు మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాకు నేరుగా జమ చేస్తారన్నారు.

ఈ మేరకు లబ్ధిదారులు ఇల్లు పూర్తి చేసుకోవడానికి తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ జి.సత్యనారాయణను కలెక్టర్ ఆదేశించారు. గృహ నిర్మాణ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమెనిటీస్, ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్లు ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లబ్దిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా సమన్వయంతో కృషి చేయాలన్నారు.

ఫ్యాక్టరీలో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య
- బి.కె.యం.యు. జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర -ఏలూరు: సోమవారం సాయంత్రం ప్రసాద్ సీడ్స్ మొక్కజొన్న ఫ్యాక్టరీలో పని చేస్తూ ప్రమాదానికి గురై మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బి.కె యం.యు.జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెదవేగి మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన ఎస్. రవీంద్ర (35)అనే యువకుడు ప్రసాద్ సీడ్స్ మొక్కజొన్న ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడని, ప్రమాదవశాత్తు మిషన్ లో పడి మృతి చెందాడని తెలిపారు. మృతి చెందిన ▶మిగతా 2లో..

వలంటీర్లను కొనసాగించాలి

యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : ఏఐవైఎఫ్ ధర్నా

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్: వలంటరీ వ్యవస్థను తిరిగి కొనసాగించాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. శ్రీనివాస్, పి. త్రిమూర్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటరీ వ్యవస్థ వల్ల గ్రామాల్లో పేదలకు సంక్షేమ పథకాలు ఇంటికి చేరవేసే అవకాశం ఉండేదన్నారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు ఈ ప్రభుత్వం 5,000 ఇస్తే తాను దాన్ని 10,000 రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చి అధికారం ఏర్పడిన తర్వాత 9 నెలలు కావస్తున్నా వలంటరీ వ్యవస్థ అసలు జీవోలోనే లేదని కూటమి లో ఉన్న పెద్దలు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా విపత్తు సమయంలో కూడా పేద ప్రజలకు వలంటీర్లు సేవలు అందించారని ఈ సందర్భంగా తెలియజేశారు. యువగళం పాదయాత్రలో కూడా లోకేష్ నియోజకవర్గ ప్రాంతంలో తిరిగి హామీ ఇచ్చి మాట నిలబెట్టుకోలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే వలంటరీ వ్యవస్థను విధుల్లోకి తీసుకుని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని

హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చింతలపూడి సునీల్, డిఎన్ జ్యోతి, ఆర్.పార్వతి, కె.కోమలి రాణి, సిహెచ్ పోసి కుమారి, పి.లావణ్య, దేవి, దుర్గ, మహాలక్ష్మి, అధిక సంఖ్యలో వలంటీర్లు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు యాప్ ప్రారంభం

విశాలాంధ్ర-రాజమండ్రి: నిత్యం రోడ్డు మీద ప్రయాణించే ఆటో డ్రైవర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ట్రాఫిక్ ఆర్టీఓ వారితో సమస్య వచ్చినా డ్రైవర్ తన మొబైల్‌లో ఆటో వాలా యాప్‌కు వెళ్లి ప్రెస్ చేస్తే వెంటనే ఏఐటీయూసీ, ఆటో యూనియన్ వారు ప్రత్యక్షం అవుతారని ఆన్‌లైన్ ఆటో యూనియన్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు తెలిపారు. మంగళవారం స్థానిక అంబల్లా సూర్యారావు భవన్‌లో ఆటో యూనియన్ సమావేశం యూనియన్ అధ్యక్షులు రామచంద్రరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు ఆటో యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఆటో అండ్ మోటార్ కార్మికులకు చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఈ నెలలో జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో అమలు చేయాలని కోరారు. జీవో నెంబర్ 21, 31 రద్దు చేయాలని, వాహనమిత్ర 15 వేల రూపాయలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఆర్ఎస్ 124(వ) నోటిఫికేషన్, 894 నోటిఫికేషన్ డ్రైవర్లకు ఉపాధి లేకుండా చేసే 2023 నూతన మోటారు యాక్ట్ చట్టం 106(1)(2) ను రద్దు చేయాలని, టాటా మ్యాజిక్ వ్యానులు, కార్లు, జీపులపై భారీగా పెంచిన రోడ్ టాక్స్ థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, గ్రీన్ టాక్స్, లేబర్ టాక్స్, టోల్గేట్

ఫీజులను 30 శాతానికి తగ్గించి డ్రైవర్ల పిల్లలకు విద్యా కానుక వెంటనే ఇవ్వాలని, ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు చేయాలని డిమాండ్ చేశారు.

పి-4 సర్వేలో పాల్గొనండి

- తగిన సమాచారం అందించి సహకరించాలి
- కలెక్టర్ ప్రశాంతి విజ్ఞప్తి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లాలో పి 4 సర్వే పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టీసీపేషన్ సర్వే నిర్వహిస్తున్నట్లు, ఇప్పటి వరకు పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంతో కలిసి పనిచేస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఇందులో ప్రజలను కూడా భాగస్వామ్యం చేసుకోవాలని, ఈ క్రమంలోనే జిల్లాలోని పేదల్లో ▶మిగతా 2లో..

వైసీపీవి దగా పోరాటాలు

- యువత, విద్యార్థులను మోసం చేసింది వైసీపీ ప్రభుత్వమే
- మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్

విశాలాంధ్రబ్యూరో -కాకినాడ : వైసీపీ నాయకులకు పరిపాలన చేతకాక రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారని, సంక్షేమ పథకాల అమలు విషయంలో ఎక్కడా పారదర్శకత పాటించలేదని, వైసీపీ నాయకుల అనాలోచిత నిర్ణయాల వల్లే యువత, విద్యార్థులకు ఈ దుస్థితి తలెత్తిందని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం కాకినాడలో మీడియాతో మాట్లాడారు. 'వ్యవస్థలను జేబు సంస్థలుగా మార్చేసి వైసీపీ నాయకులు రాష్ట్ర ప్రజలను దగా చేశారని అన్నారు. 44 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని వైసీపీ అధినాయకుడు గొప్పలు చెప్పుకొన్నాడని, వారు ఇచ్చామని చెప్పుకొనే ఉద్యోగాల్లో వాలంటీర్లు కూడా ఉన్నారని అన్నారు. వారికి గత ప్రభుత్వంలోనే గడువు ముగిసినా పొడిగించేందుకు ఎటువంటి జీవో జారీ చేయలేదని తెలిపారు. జీవో ▶మిగతా 2లో..

చేతివృత్తుల వారికి లయన్స్ క్లబ్ చేయూత

విశాలాంధ్ర- ఉండి : సమాజంలో చేతివృత్తులతో జీవనోపాధి పొందుతున్న వారిని ఆదుకోవటానికి చిరుప్రయత్నం ఉండి లయన్స్ క్లబ్ చేసినట్లు క్లబ్ వైస్ ప్రెసిడెంట్, కార్యదర్శులు డాక్టర్ గాదిరాజు

రంగరాజు, ముదునూరి శివరామరాజు అన్నారు. ఉండిలో మంగళవారం శివరామరాజు స్వగృహంలో సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీజియన్ ఛైర్మన్ గొంట్ల కృష్ణమూర్తి 50శాతం ఖర్చు భరించి ఇచ్చిన గ్రైండర్, గొడుగులు, వీల్ చైర్, ట్రై సైకిల్ లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు, డి సి కన్నెగంటి రూత్ కళ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాలతీర్థపు నరసింగ్ రావు, కాగిత మహంకాళి, గొట్టుముక్కల రాము, బొండాడ కేశవరావు, భూపతి హరనాథ్ రాజు లబ్దదారులు పాల్గొన్నారు. ఫస్ట్ బెస్ట్ ట్రెజరర్ గా పాలతీర్థపు నరసింగ్ రావు, బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు క్లబ్ అధ్యక్షులు సత్తి బ్రహ్మారెడ్డి, అప్రిచే సియన్ అవార్డు క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు, సెకండ్ బెస్ట్ బ్యానర్ ప్రజంటేషన్ అవార్డు క్లబ్ కు వచ్చాయి.

రాష్ట్ర వైసీపీ వాణిజ్య విభాగ కార్యదర్శిగా రామిశెట్టి సత్యనారాయణ

విశాలాంధ్ర-ముదినేపల్లి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శిగా ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణకు వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి నియామక

పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే, ఏలూరుజిల్లా పార్టీ ఇన్చార్జి దూలం నాగేశ్వరరావు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి ఘంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధ, మండల పార్టీ అధ్యక్షులు బోయిన రామరాజు, జిల్లా అధికార ప్రతినిధి మోట్రు ఏసుబాబా, వైఎస్ఆర్సిపి ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ , పెయ్యేరు వైస్ సర్పంచ్ దివి సతీష్, పలువురు ఎంపిటీసీలు , సర్పంచులు , నాయకులు అభినందించారు.

అక్రమంగా మారుజాతి కర్ర రవాణా చేస్తున్న లారీలు సీజ్

విశాలాంధ్ర - కొయ్యలగూడెం :అక్రమంగా మారుజాతి పుల్లలు తరలిస్తున్న మూడు లారీలను అదుపులోకి తీసుకోవడం జరిగిందని అటవీ శాఖ సెక్షన్ అధికారి దినేష్ తెలిపారు. కన్నాపురం రేంజ్ పరిధి ఎర్రంపేట గ్రామ శివారున మారు జాతి పుల్లలు తరలిస్తున్న లారీలను స్వాధీనపరచుకున్నామని అన్నారు. అక్రమంగా మారు జాతి పుల్లను అనుమతులు లేకుండా తరలిస్తే తగు చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారి శివరామకృష్ణ తెలిపారు. పేరుపాలెం గ్రామం నుండి ఎర్రంపేట గ్రామానికి ఒక లారీ, కొయ్యలగూడెం సమీపంలో ఉన్న ఇటుకల బట్టికి రెండు లారీలు పుల్లలను తరలిస్తున్నారని, మూడు లారీల పుల్లల విలువ లక్ష రూపాయలు ఉంటుందని శివ రామకృష్ణ పేర్కొన్నారు. ఈ దాడిలో ఫారెస్ట్ చెక్ పోస్ట్ హెల్పర్ శివాజీ , సిబ్బంది ఉన్నారు.

పాస్‌పోర్టు పోయినది

తాండ్ర నాగరాజు S/o. తాండ్ర అప్పారావు, డోర్‌నెం.3-51/1, వెంకటాపురం కాలనీ, రామాలయం వద్ద, కోరుకొల్లు, పాలకోడేరు మండలం, పిన్: 534209 ప॥గో॥జిల్లా, నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు U1857564 ఒక పాలిథిన్ కవర్లో పెట్టుకుని ది. 25.01.2025 న॥రం తేదిన ఉదయం 10 గం॥లకు మా ఇంటి వద్ద నుండి పాలకోడేరు సెంటర్‌కు మోటారు సైకిల్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో సదరు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పెట్టిన కవరు జారిపడి పోయినది. ఎంత వెదికినను దొరకలేదు. కావున ఎవరి కైనను దొరికిన ఎడల పైన తెలిపిన చిరునామాకు అందచేయగలరు.

ఎన్జీవోలు ప్రజలకు, న్యాయ సేవాధికార సంస్థకు వారధిగా నిలవాలి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే సేవలపై ఎన్జీఓలు ప్రజలను చైతన్య పరచి ప్రజలకు, న్యాయ సేవాధికార సంస్థకు వారధిగా పని చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో స్థానిక ఎన్జీవో సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ ఆయా సంస్థలు అందిస్తున్న సేవల విషయాలలో అవసరమైన న్యాయ

సహాయాన్ని అందించడానికి సేవాధికార సంస్థ సహకరిస్తుందని స్పష్టం చేశారు. ఎన్జీవోలు తమ పనితీరును మెరుగుపరుచు కోవడానికి వివిధ సంఘాలతో తరచుగా సమావేశమై సేవలను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఎన్జీవో సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదు తరాల కుటుంబ సభ్యుల మధ్య జన్మదిన వేడుక

విశాలాంధ్ర-భీమడోలు: కురెళ్ళ గూడెం గ్రామానికి చెందిన కీ.శే. కురెళ్ళ శేషగిరి రావు సతీమణి కురెళ్ళ చంద్రావతి జన్మించి 100 సంవత్సరాలు అయిన సందర్భంగా ఐదు తరాలకు చెందిన కుటుంబ సభ్యులు గ్రామం లో అంగరంగ వైభవంగా చంద్రావతి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. మంగళవారం నాటికి నూరు వసంతాలు పూర్తి అవుతాయని ఈ సందర్భంగా గ్రామంలో అనేక సేవా

కార్యక్రమాలతో పాటు వృద్ధులకు, పేదలకు పండ్లు, పలహారాలను కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు.

దగా పోరాటాలు

(1వ పేజీ తరువాయి)

ఇవ్వకుండానే ఎన్నికలకు వెళ్లి వాలంటీర్లను దగా చేసింది జగనే అన్నారు. వైసీపీ పాలనలో ఏ వర్గాలైతే మోసానికి గురయ్యాయో వారందరికీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మనోహర్ అన్నారు.

ఆవిర్భావ సభకు పకడ్బందీగా ఏర్పాట్లు : పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ వేదికగా నిర్వహిస్తోన్న ఆవిర్భావ సభకు పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఐదు పార్కింగ్ జోన్స్ ఏర్పాటు చేశామని, ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్దేశిత ప్రదేశాల్లో పార్కింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ భద్రత ఏర్పాట్లపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులతో చర్చించామన్నారు. జనసేన పార్టీని ఏ లక్ష్యం కోసం పవన్ కళ్యాణ్ స్థాపించారో ఆ లక్ష్యం దిశగా తొలి అడుగులు పడాయని పేర్కొన్నారు. కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ మాట్లాడుతూ లక్షలాది మంది కార్యకర్తలు తరలివచ్చే ఆవిర్భావసభకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని, తిరుగు ప్రయాణంలో కూడా భోజనానికి ఇబ్బందులు కలగకుండా ముఖ్యమైన నాలుగు రహదారుల్లో భోజన వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు.

సర్వేలో పాల్గొనండి

(1వ పేజీ తరువాయి)

పేదలని గుర్తించడం, వారి తలసరి ఆదాయం పెంచే ప్రయత్నంలో వారి ఆర్థిక పరిస్థితి తెలుసు కుని, వారు ఏ పనిచేస్తే ఆదాయం వస్తుందనే అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం కోసం ఈ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఆగ్రామంలో ఎవరైతే ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్నారో గుర్తించి, వారి సహకారం తీసుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఇందు కోసం సచివాలయ సిబ్బంది అందరినీ సర్వే లో పాల్గొనడం, వివరాలు తెలుసుకోవడం జరుగు తోందని, ప్రజలందరు ఈ సర్వేలో పాల్గొని తగిన సమాచారం అందించాలని కోరారు. ఈ సర్వే చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకి పి జి ఆర్ ఎస్ ద్వారా వారి సమస్యలు పరిష్కారం కోసం ఇస్తున్న అర్జీ పరిష్కార స్థాయి, ప్రజల సంతృప్తి స్థాయి తెలుసుకోవడం కూడా సమాంతరంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రశాంతి తెలియ చేసారు. మార్చి 18 వరకు సర్వే ప్రక్రియ చేపట్టనున్నట్లు, సర్వే సిబ్బందికి తగిన సహకారం అందించి జిల్లా ప్రగతి పథంలో భాగస్వామ్యం కావాలని కోరారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

(1వ పేజీ తరువాయి)

యువకుని కుటుంబానికి ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలలో అధికారుల పర్యవేక్షణ కొరవడిన కారణంగానే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు.

కార్మిక శాఖ, ఫ్యాక్టరీల తనిఖీ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేయడంతో కూలీలకు, కార్మికులకు సరైన భద్రత లేకుండా పోయిందని అన్నారు. సరైన పర్యవేక్షణ లేని కారణంగా యజమానులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని,ఈ కారణంగా ప్రమాదాలు జరిగి కూలీలు, కార్మికుల ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక శాఖ అధికారులు నిబంధనలు ప్రకారం నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, అగ్ని ప్రమాదాల నివారణకు సరైన చర్యలు చేపట్ట లని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోని ఫ్యాక్టరీ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యాజమాన్యాలు కూడా కూలీలకు, కార్మికులకు భద్రత కల్పించాలన్నారు. మృతుని కుటుంబానికి తక్షణం నష్ట పరిహారం చెల్లించాలని లేనిపక్షంలో మృతుని కుటుంబం తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పేదల ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వానిదే : మంత్రి పార్థసారథి

విశాలాంధ్ర- ముసునూరు: ప్రతి పేదవాడి ఆరోగ్య భద్రత కోసం కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా ఆర్థిక భరోసా కల్పిస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ,పౌర సమాచార శాఖామంత్రి కొలుసు

పార్థసారధి అన్నారు. గుళ్ల పూడి గ్రామానికి చెందిన నూర్ భాషా ఐసా రజిఇల్లా అనారోగ్య కారణం చేత విజయవాడ హెల్ప్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో మెరుగైన వైద్యం అందించేందుకు బాధిత కుటుంబ సభ్యులు మంత్రి పార్థసారధిని ఆర్థిక సహాయం కోరగా తక్షణమే స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నాలుగు గంటలు గడవకముందే వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2.50 లక్షల విలువైన చెక్కులను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు బరియల్ గ్రౌండ్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : భీమవరం పట్టణంలోని 39వ వార్డులో నివాసం ఉంటున్న దళితులు, దళిత క్రైస్తవులకు బరియల్ గ్రౌండ్ ఏర్పాటు చేయాలని మంగళవారం దళిత ఐక్య వేదిక భీమవరం

శాఖ ఆధ్వర్యంలో తహసీల్దారు రాంబాబుకు వినతి పత్రం అంద జేశారు. ఈ సంద ర్భంగా దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ భీమవరం పట్టణంలో వేలాది మంది, దళిత క్రైస్తవులు నివసిస్తున్నారని, వారికి బరియల్ గ్రౌండ్ లేక ఇబ్బందులు పడుతున్నారని మనిషి చనిపోతే పాతిపెట్టడానికి స్థలంలేక నానా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే రెండు ఎకరాలు బరియల్ గ్రౌండ్ నిమిత్తం స్థలం కేటాయించాలని ఆయన కోరారు. తహసీల్దార్ రాంబాబు మాట్లాడుతూ ఉన్నత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్ళి పరిష్కారం చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో పరువు విజయ్ కుమార్, అంబటి ఆనంద్ కుమార్, టి. జోన, కెనడి, పలువురు దళిత క్రైస్తవులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్యం

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : విద్యాబుద్ధులు నేర్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగిన తర్వాత తాను చదివిన పాఠశాల, గురువులను కూడా మర్చిపోతున్న యువతరం ఉన్న ఈ రోజుల్లో భీమవరం కాకతీయ మెరిట్ స్కూల్లోని పూర్వ విద్యార్థి డాక్టర్ మురళి

ఆదర్శవంతంగా నిలుస్తున్నారు. ఎంబీబీఎస్ చేసి, చిన్న పిల్లల వైద్య విభాగంలో పీజీ కూడా పూర్తి చేసిన పీడియాట్రిక్ వైద్యులు మురళి తాను చదువుకున్న పాఠశాలకు వచ్చారు. తాను వైద్యునిగా పనిచేస్తున్న మిత్రా మెడికేర్ హాస్పిటల్స్ సహకారంతో చదువుకున్న పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, చిన్నారులకు చెవి, కంటి, దంత పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. విద్యార్థి దశలోనే పిల్లల్లో ఉన్న లోపాలు గుర్తించి వైద్య సహాయం అందిస్తే వారి ఎదుగుదల పూర్తి ఆరోగ్యవంతంగా ఉండి , వారి భవిష్యత్తు బాగుంటుందనే సదుద్దేశంతోనే తాను చదువుకున్న పాఠశాలలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించడం ఆనందంగా ఉందని డాక్టర్ మురళి అభిప్రాయం వ్యక్తం చేశారు. పౌష్టికాహారం లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి తదుపరి చికిత్స కోసం సూచనలు సలహాలు చేశారు. తమ విద్యార్థి వైద్యునిగా ఎదిగి తిరిగి తమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం కోసం సేవలందిం చడం ఆనందంగా ఉందని ఆ పాఠశాల కరస్పాండెంట్ కృష్ణకిషోర్ ఆనందం వ్యక్తం చేశారు.

రీ సర్వే పారదర్శకంగా జరగాలి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర -ఏలూరు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవెల్‌లో ముంపు బారిన పడుతున్న గ్రామాల రీ సర్వే పారదర్శకంగా చేపట్టాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సర్వే ప్రక్రియకు గ్రామాలలో ముందస్తు సమాచారం తెలపాలన్నారు. ఇప్పటికే నిర్వాసితులకు కొంత మందికి పరిహారం ప్రభుత్వం చెల్లించడం పట్ల సిపిఐ హర్షం వ్యక్తం చేస్తుంది అన్నారు. ఉపాధి పనులు లేక కొంతమంది నిర్వాసితులు ఉపాధి నిమిత్తం వలసలు వెళ్లారని,అనంతరం తిరిగి వారి గ్రామాలకు చేరుకుంటారని వీరిని స్థానికంగా ఉన్నట్లుగా గుర్తించి పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.18 ఏళ్ళు నిండిన యువత విద్యాభ్యాసం నిమిత్తం పట్టణ ప్రాంతాలకు వెళుతుంటారని, కానీ ప్రభుత్వం స్థానికేతరులుగా గుర్తించి పరిహారం అందజేయకపోవడం సరైన చర్య కాదన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు కటాఫ్ తేదీని సవరించి నిర్వాసితులను తరలించే తేదీని కటాఫ్ తేదీగా నిర్ణయించి పరిహారం చెల్లించాలన్నారు. మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని,ఏ ఒక్క నిర్వాసితునికి అన్యాయం జరగకుండా ప్రభు త్వం చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో సిపిఐ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పక్షాన పోరాడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

టీడీపీ, వైసీపీ దొందూ దొందే

విశాలాంధ్ర- ఉండి : భూముల రీ సర్వే పేరుతో గత వైసిపి ప్రభుత్వం ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని ఎండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పి వీఎస్ గోపాలకృష్ణన్ రాజు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రోన్లు సర్వేతో రైతుల భూములు హెచ్చుతగ్గులు వచ్చి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన మోసానికి రైతులంతా వ్యతిరేకంగా ఓట్లు వేయకుండా సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపిస్తే ఈ ప్రభుత్వంలో ఉన్న మంత్రులు ఎమ్మెల్యేలు కూడా రైతులు వ్యథను పట్టించుకోవటం లేదని విమర్శించారు. భూ సర్వే ను రద్దు చేయకుండా టైటిల్ లీడ్ మాత్రమే రద్దుచేసి రీ సర్వే ను కొనసాగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత రికార్డులు ప్రకారం పాత పద్ధతులలోనే సర్వే నిర్వహించాలని గోపాల కృష్ణంరాజు విజ్ఞప్తి చేశారు.

సీడాప్ ద్వారా శిక్షణ, కొలువులు

విశాలాంధ్ర -భీమవరం: సొసైటీ ఫర్ ఎంప్లాయ్మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైజ్ డెవలప్మెంట్ (సీడాప్) ద్వారా ఈ నెల 14, 18, 28వ తేదీల్లో జిల్లాలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మైనారిటీ కార్పొరేషన్ ఇ.డి.ఎన్.ఎస్. కృపావరం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మైనారిటీ వర్గాలకు చెందిన యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మైనారిటీ యువత తమ అర్హతలను బట్టి సిడాప్.ఎపి.గవ్.ఇన్ లో నమోదు చేసుకుని ఆయా కోర్సుల్లో శిక్షణ పొందవచ్చని మరిన్ని వివరాలకు 9849901162 నెంబర్లో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ తక్షణమే అమలు జరిపి పేదల సొంత ఇంటికల నెరవేర్చాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు.

సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని లంకపేట, దుర్గాపురం తదితర ప్రాంతాల్లో ఇళ్ళులేని నిరుపేదల చేత ఇళ్ల స్థలాలకై వ్యక్తిగత అర్జీలను పూర్తి చేయించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తుందని అన్నారు. వారు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలు సొంత గృహాలు లేక అద్దె ఇళ్ళకు నెలకు ఐదు నుంచి ఆరు వేల రూపాయలు అద్దెలు చెల్లించలేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో జగన్ ఇచ్చిన ఇళ్ల స్థలాలు బాత్ రూములకు కూడా చాలవని అప్పుడు చంద్రబాబు విమర్శించారని, మాట నిలబెట్టుకుని జగనన్న నివేశనా స్థలాల లబ్ధిదారులకు కూడా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోనాల డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, ఏపీ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, పెద్ద సంఖ్యలో అర్జీదారులు పాల్గొన్నారు.

విజయవాడ తరలిన మున్సిపల్ కార్మికులు

విశాలాంధ్ర -భీమవరం: అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్మిస్తామని ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎ.పి. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో చేపట్టిన చలో విజయవాడకు మంగళ వారం మున్సిపల్ కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించిన చెల్లబోయిన, కిలారి మల్లేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, పారిశుధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల వేతనాల చెల్లింపులు మున్సిపల్ శాఖ నుండే చెల్లించాలని, ఉద్యోగులకు, కార్మికులకు సాంఘిక భద్రత కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఇంజ నీరింగ్ కార్మికుల వేతనాల పెరుగుదలపై గత సమ్మెలో నాటి ప్రభుత్వం అంగీకరిం చిన ఒప్పందాన్ని తక్షణం అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ ప్రాంతాల్లో సిబ్బంది పెరిగిన కారణంగా పారిశుధ్య కార్మికులపై పని భారం పెరిగిందని, పెరిగిన జనాభా ప్రాతి పదికన సిబ్బందిని రిక్రూట్ చేయాలని వారు కోరారు. విది నిర్వహణలో మరణించిన, పదవీ విరమణ చేసిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను నియమించాలని, కాంట్రాక్ట్ ఇంజనీరింగ్ సిబ్బందికి సంక్షేమ పథకాలు వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. పాఠశాల స్వీపర్లలకు జీతాలు పెంచాలని, వారి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐసిటియు నాయకులు కె.మహంకాళి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నీలాపు చిత్తరంజన్, కె.యోహాను, నీలాపు శ్రీను, దుర్గారావు, పెద్ద సంఖ్యలో మహిళా కార్మికులు పాల్గొన్నారు.

ఎం.ఎస్.ఎం.ఈ సంస్థలకు సకాలంలో రాయితీలు చెల్లించాలి : ఎమ్మెల్సీ వంక

విశాలాంధ్ర-తణుకు: ఎం.ఎస్.ఎం.ఇ సంస్థలకు సకాలంలో రాయితీలు చెల్లించాలని శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బడ్జెట్ సమావేశాలలో జరిగిన చర్చలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాయితీలు సకా లంలో ఇవ్వాలని, దీనికి తోడు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన, గ్రామీణ ఎం ఎస్ ఎం ఈ సంస్థకు చేరాలని సూచించారు. రాయితీలు చెల్లించే విషయంలో పూర్తి పారదర్శకత ఉండాలని, ముందుగా మంజూరు ఆయనవి, ముందుగా ఇవ్వాలని సూచించారు. గత ప్రభుత్వంలో జగనన్న బడుగు వికాసం పథకంలో అనేక ఎస్.సి.,ఎస్.టి., ఓబీసీ వర్గాలకు చెందిన ఎం.ఎస్.ఎం.ఈ.లు బస్సులు కొనుగోలు చేసుకొని, ఆర్టీసీ ద్వారా రూట్‌లలో తిప్పుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం ఇచ్చే రాయితీ 50 శాతం తక్షణం చెల్లించాలని,ఇది ఆలస్యమైతే పేద వర్గాలు ఆర్థికంగా నష్ట పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

రోగులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ మహిళా ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి గంగిరెడ్ల మేఘల దేవి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కొయ్యలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఆమె రోగులకు వైద్యం అందడం లేదని పలువురు తన దృష్టికి తీసుకు వచ్చినట్లు ఆమె తెలిపారు. కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులను జంగారెడ్డిగూడెం రిఫర్ చేస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు తాను ఆసుపత్రిని సందర్శించానని మేఘల దేవి అన్నారు. ఆసుపత్రి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉందని, కొరతను భర్తీ చేసేందుకు, సంబంధిత అధికారులతో, ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్, పోలవరం శాసనసభ్యులు చిర్రీ బాలరాజు , వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ లతో మాట్లాడి తక్షణమే సిబ్బందిని పూర్తిస్థాయిలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట కొత్త రమ, జన జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర-లింగపాలెం: స్వయం ఉపాధి రుణాలు పొందేందుకు వెనుకబడిన కులాలకు చెందినవారు దరఖాస్తు చేసుకోవాలని లింగపాలెం ఎంపీడీవో కే.వాణి తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయంలో ఆన్‌లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని దీనికోసం ఏపీఓబిఎంఎంఎస్ వెబ్ సైట్ అందుబాటులో ఉందని అన్నారు.18 ఏళ్ల వయసు నుంచి50 ఏళ్ళ వయసు ఉన్న వారంతా అర్హులని యువతి,యువకులు, మహిళలు, పురుషులు ఆన్ లైన్ ద్వారా రుణాలు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఈ నెల 22 వరకు గడువు ఉందని తెలిపారు.

ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర -భీమవరం: హైదరాబాద్‌కు చెందిన లిటిల్ ఛాంప్స్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన తెలుగు ఒలింపియాడ్ లో ఆదిత్య స్కూల్ విద్యార్థులు స్టేట్ ఫస్ట్, 6వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఆదిత్య కృష్ణంరాజు మాట్లాడుతూ తమ విద్యార్థులు చదువు, క్రీడలు, సాంస్కృతిక పోటీల్లోనే కాకుండా పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తున్నారని ప్రశంసించారు. విద్యార్థులను ఆల్ రౌండ్ ప్రతిభతో తీర్చిదిద్దుతున్న అధ్యాపక బృందాన్ని అభినందించారు. అనంతరం ర్యాంకులు సాధించిన రోహిత్ శ్రీరంజని, జె.సాయిసిద్ధిక్షితలను అభినందించారు. కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయులు టి.శ్రీనివాస్ బి.యుగసుధ, కె.సత్యనారాయణ, దుర్గాంబ సిబ్బంది పాల్గొన్నారు.



ఏజెన్సీలో రహదారుల నిర్మాణం చేపట్టండి

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: జగన్ ప్రభుత్వ హయాంలో రోడ్ల దుస్థితిని ఎత్తిచూపుతూ రోడ్లపై వినూత్న నిరసన కార్యక్రమాలు చేపట్టి, తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన కూటమి పాలకులు అధికారంలోకి వచ్చాక రోడ్ల నిర్మాణాన్ని గాలికొదిలేసారు. పశ్చిమ ఏజెన్సీ మెట్ట ప్రాంతమైన బుట్టాయిగూడెం మండలంలో ఏ మూల చూసినా సరైన రోడ్ల వ్యవస్థ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుట్టాయిగూడెం నుండి జంగారెడ్డిగూడెం నిత్యం అనేకమంది ప్రయాణించే ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా మారి ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో 10 కిలోమీటర్లు ఈ రహదారిని నిర్మించేందుకు అప్పటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు 2022 అక్టోబర్ లో సుమారు 3.5 కోట్ల రూపాయలు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నిధులు మంజూరవ్వగా రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి, పనులు కూడా ప్రారంభించారు. రహదారి పనులు ప్రారంభం కావడం చూసిన ప్రజలు ఒకింత ఆనందాన్ని వెల్లబుచ్చారు. కాగా మార్కెటింగ్ శాఖ తమ వద్ద నిధులు లేవని తెలపడంతో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ఆదిలోనే పనులకు స్వస్తి చెప్పడంతో పనులు నిలిచిపోయాయి. రెండు నెలల క్రితం అరకొరగా 70 లక్షల రూపాయల వ్యయంతో 1.5 కి మీ మేర రహదారి నిర్మించారు. పూర్తి కాకుండా అక్కడక్కడ ముక్కలు ముక్కలుగా నిర్మించడంతో ప్రయాణికులకు నరకం తప్పలేదు. గుంతల మయమైన ఈ రోడ్డు లో ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాణ్యత గల బీటి రోడ్డు నిర్మాణం జరుగుతుందని ప్రయాణికులు ఆశించినప్పటికీ వారి ఆశలు నిరాశగా మిగిలాయి. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రయాణికులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఉల్లాస్ పరీక్షలకు ఏర్పాట్లు

- జిల్లాలో 7,321 మంది అభ్యాసకులు
- 732 పరీక్షా కేంద్రాలు : కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం కింద నమోదైన నిరక్షరాస్యులైన వయోజనులకు ఈనెల 23వ తేదీన నిర్వహించే పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళ వారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉల్లాస్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై వయోజన విద్యా, విద్యాశాఖ, తదితర అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా

ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం కింద అక్షరాస్యత శిక్షణ పూర్తిచేసిన 7,321 మంది ఈ పరీక్షలు వ్రాయనున్నారని అందుకోసం 732 పాఠశాలలు గుర్తించి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ వారు ఈనెల 23వ తేదీ ఆదివారం అంగన్వాడీ సెంటర్‌లో , స్థానిక పాఠశాలల్లో గానీ ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల పరిధిలో మండల విద్యా శాఖాధికారి2,సెర్ఫ్ ఎపిఎం, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఈ పరీక్షలను సమర్ధవంతవంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, ఐసిడిఎస్ పిడి పి.శారద,డిఇఓ వెంకటలక్ష్మమ్మ, వయోజన విద్యా శాఖ డిడి ప్రభాకరరావు, ఉల్లాస్ నోడల్ అధికారి, ఆర్. విజయ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వార్షిక వేడుకలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 54 వ వార్షిక, వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి మంగళవారం

తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం,రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో మూడవ సంవత్సరం చదివి పాసై బయటికి వెళ్తున్న వారికి వీడ్కోలు వేడుకల్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ 2024 - 25 కు సంబంధించిన విద్యా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. కళాశాల సాధించిన విజయాన్ని విద్యార్థులకు తెలిపారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మీ ముందు ఉజ్వల భవిష్యత్తు ఉందని దానిని సాకారం చేసుకోవాల్సిందిగా, ఉద్యోగాలను సాధించి,ఉన్నత స్థితిలో ఉండవలసిందిగా, ఉన్నత చదువులు చదివి ఉత్తమ పౌరులుగా, సంస్కారవంతులుగా తీర్చిదిద్దబడాలని విద్యార్థులను కోరారు.క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు, అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ చైతన్య, డాక్టర్ టి అక్కిరాజు, డాక్టర్ కె. స్వరూప, కె.వి గణేష్ కుమార్, ఎన్ వి ఎన్ బి శ్రీనివాసరావు, డాక్టర్ జి. వెంకటరావు, డాక్టర్ జివి శారదా దేవి, డాక్టర్ సిహెచ్ అనూరాధ, డాక్టర్ జి. వెంకటరమణ కె. గిరిబాబు, షేక్ పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

నేరగాళ్ల పట్ల షాపు యజమానులు అప్రమత్తంగా వుండాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: నేరగాళ్ల పట్ల షాపు యజమానులు అప్రమత్తంగా వుండాలని ఎస్ఐ ఎం. జయబాబు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో వర్తక సంఘాలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులందరూ సైబర్



నేరగాళ్లపట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. షాపు యజమానులందరూ తమ వ్యాపార సంస్థల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో దొంగలు చోరీకి పాల్పడకుండా నైట్ వాచ్ మాన్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జూలూరి గోపి, ముత్తంశెట్టి శ్రీనివాస్, జె మణి కంఠ, సుబ్బరాజు, పరిమి కళ్యాణ్, నోముల సత్యనారాయణ, చేబోలు తాతా రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయండి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -తణుకు: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తణుకు పట్టణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు మార్చి 15వ తేదీన రానున్నారు. ఈ మూడవ శనివారం నిర్వహించే కార్యక్రమాన్ని సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ నిషేధం అనే స్లోగన్‌తో నిర్వహించ నున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి, సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా శ్రీ ముళ్ళపూడి వెంకటరాయ మెమోరియల్ పాలిటెక్నికల్ కాలేజ్‌లో హెలిప్యాడ్, ఆడిటోరియం, జాస్తి సీతామహా లక్ష్మి బాలి కోన్నత పాఠశాలలో పార్కింగ్ ప్రదేశం, జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో ప్రజా వేదిక, స్టాల్స్ ప్రదర్శనకు ప్రాథమి కంగా స్థలాల పరిశీలన చేశారు. అనంతరం తణుకు మున్సిపల్ కార్యాలయ

సమావేశ మందిరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి వివిధ శాఖల అధికారులతో సమావేశమై ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. ముఖ్య మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. బారికేడింగ్ ఏర్పాటుకు అవసర మైన ప్రాంతాలను గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని, హెలిప్యాడ్‌ను సిద్ధం చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. పర్యట నలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, తాడేపల్లిగూడెం, నరసాపురం ఆర్డీవోలు కతీబ్ కౌసర్ భానో, దాసిరాజు, డి.ఎస్.పి డి.విశ్వనాథ్ తదితరులున్నారు.

కార్మికుల రక్షణకు చర్యలు : ఫ్యాక్టరీల్లో అధికారుల తనిఖీలు

విశాలాంధ్ర-లింగపాలెం : మొక్కజొన్న డ్రైయర్ ఫ్యాక్టరీలలో జరుగుతున్న వరుస ప్రమాద సంఘటనలపై స్పందించిన కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, కర్మాగారాల శాఖఅధికారి త్రినాథ్ సంయుక్తంగా ఫ్యాక్టరీలలో తనిఖీలు నిర్వహించారు. లింగపాలెం మండలం, పెదవేగి మండలాల్లో ఉన్న ఫ్యాక్టరీలకు వీరు వెళ్లి స్వయంగా పరిస్థితులను పరిశీలించారు. పెదవేగి మండలం రామచంద్రపురంలోని ఒక ఫ్యాక్టరీకి చెందిన వ్యవసాయ భూమిలో పండించిన మొక్కజొన్న చొప్పను లీజుకు తీసుకుని గ్రాసం తయారు చేస్తుండగా రామచంద్రపురంకు చెందిన ఎస్. రవీంద్ర(35) మృతి చెందాడు. ఇతని దేహం మిషన్‌లో పడటంతో నుజ్జునుజ్జ యింది. ఈ సంఘటన మృతుని బంధువులలో, గ్రామంలో ఆగ్రహం కలిగించింది. ప్రజలందరూ ఒక్కసారిగా తిరుగుబాటు చేశారు. ఈ సంఘటనకు ముందు లింగపాలెం మండలంలో గత నెల28న ములగలంపాడులో ఉన్న జిఎస్ సీడ్స్ ఫ్యాక్టరీలో బీహార్ రాష్ట్రానికి చెందిన సుపేష్ కుమార్(21) అనే కార్మికుడు డ్రయర్ బిన్నులో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి ముందు ధర్మాజీగూడెం విజయలక్ష్మి సీడ్స్ ఫ్యాక్టరీలో ముసునూరుకు

చెందిన డ్రైవర్ అగస్టీన్(50) ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. ఫ్యాక్టరీలలో వరుస సంఘటనలతో కార్మికులు మృతి చెందడంపై కార్మిక, కర్మాగారాల శాఖల అధికారులు తీవ్రంగా స్పందించారు. ఫ్యాక్టరీలలో ఉన్న పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ప్రమాదాలకు గల కారణాలు కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై తనిఖీలు చేశారు. ఇటువంటి ప్రమాదాలు నివారిం చేందుకు తగు జాగ్రత్తలు తీసుకునేలా ఫ్యాక్టరీల యాజ్యమాన్యులకు నోటీసులు అందిస్తున్నట్లు కర్మాగారాలు శాఖ ఇన్ స్పెక్టర్ త్రినాధ్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించకపోతే చట్టపరమైన చర్యలను యాజమాన్యంపై తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదాలు జరగకుండా ముందు నుంచే యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

జిజిహెచ్, త్రిబుల్ఐటీల్లో సదుపాయాల కల్పనకు రూ.15.26 కోట్లు మంజూరు చేయండి

-కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ మహేష్

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : జిల్లా కేంద్రమైన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి, నూజివీడు ట్రిపుల్ ఐటిలో మౌలిక వసతుల కల్పనకు రూ. 15.26 కోట్లు సిఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్‌కు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు దిల్లీలోని శ్రమశక్తి భవన్లో కేంద్రమంత్రి మనోహర్ లాల్ ను ఎంపీ మహేష్ మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

చుట్టుపక్కల ఐదు జిల్లాల పరిధిలోని రోగులకు సేవలందిస్తున్న ఏలూరు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జిజిహెచ్)కు అత్యవసర వైద్య పరికరాలు సమకూర్చడం కోసం పవర్ గ్రిడ్ నుంచి సిఎస్ఆర్ నిధులు రూ. 3.09 కోట్లు మంజూరు చేయాలని ఎంపీ కోరారు. ఇటీవల ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా రోగులు పలు సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వీలుగా కీలకమైన వైద్య పరికరాలను కొనుగోలు చేయాల్సి ఉందని ఎంపీ మహేష్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో అకడమిక్ లాబొరేటరీలను సమకూర్చడానికి ఎన్టిపిసి నుంచి సిఎస్ఆర్ నిధులు రూ. 12.17 కోట్లు మంజూరు చేయాలని మంత్రికి విన్నవించారు. తన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి మనోహర్ లాల్ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు.

అలెగ్జాండర్ ఫ్లెమింగ్ వర్ధంతి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కుంతలగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలోమంగళవారం పెన్సిలిన్ సృష్టికర్త అలెగ్జాండర్ ఫ్లెమింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బాలికలు ఆయనకు పూలమాలలతో నివాళు లర్పించారు. ఈ

సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకటరమణ మాట్లాడుతూ ఫ్లెమింగ్ కనిపెట్టిన పెన్సిలిన్ ప్రపంచంలో అతి గొప్ప ఆవిష్కరణగాపేర్కొన్నారు. యాంటీబయోటిక్‌గా మానవాళికి ఎంతో ఉపయోగపడిందన్నారు. ఈ ఆవిష్కరణ చేసిన అలెగ్జాండర్ ఫ్లెమింగ్ 20వ శతాబ్దపు అత్యుత్తమ వ్యక్తుల్లో ఒక్కరిగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. అమృత, కె.ఏసేపు, కే రుత్ పాలేనా బాల బాలికలు పాల్గొన్నారు.

18 ఏళ్ళుగా ప్రభుత్వ రోడ్లకు అటవీశాఖ అడ్డంకులు

ప్రైవేట్ వ్యక్తులకు ఎనలేని ప్రోత్సాహకాలు

విశాలాంధ్ర - చాట్రాయి : గడచిన 18 ఏళ్లుగా ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన నిర్మించే ప్రధాన రహదారులను అడ్డుకునే అడవి శాఖ అధికారులు ప్రైవేటు వ్యక్తులకు ఎనలేని ప్రోత్సాహకాలను ఇస్తున్నారని పలువురు చర్చించుకోవడం గమనార్హం.చాట్రాయి మండలం చీపురుగూడెం పంచాయతీలో నిర్మించిన ఏసీ కోళ్ల ఫారం లోకయుక్త కేసులో విచారణ ఎదుర్కొంటున్న నేపథ్యంలో భూమి పూర్వపరాలు పరిశీలించిన నేపథ్యంలో 13 ఎకరాల భూమి అడవి భూమిగానే గుర్తించిన నేపథ్యంలో అనేక అంశాలు చర్చనీయాంశం అవుతున్నాయి. ప్రధానంగా చీపురుగూడెం నుంచి తమ్మిలేరు రిజర్వాయర్ మీదుగా మంకొల్లు గ్రామంలోని విస్సన్నపేట వెలగలపల్లి ప్రధాన రహదారి వుంది.చీపురుగూడెం అడవి మధ్యలో నుంచి రోడ్డు సుమారు ఒక కిలోమీటర్ పొడవు ఉండగా 2007 వ సంవత్సరంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో నాటి తిరువూరు శాసనసభ్యులు, సీనియర్

నాయకులు కోనేరు రంగారావు ముఖ్యమంత్రిగా ఉండి తారు రోడ్డు మంజూరు చేయించగా అటవీ శాఖ అభ్యంతరాలతో ఆనాటి నుంచి ఈనాటి వరకూ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటూనే ఉన్నారు. పోతనపల్లి నుంచి ప్రధాన రహదారికి వచ్చే మార్గంలో కూడా సుమారు 700 మీటర్లు అటవీ శాఖ అభ్యంతరాలతోనే రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. గద్దె అనురాధ జిల్లా పరిషత్ చైర్మన్ గా ఉన్నప్పుడు చాట్రాయి జెడ్పీటీసీ కోటాలో రూ. 5 లక్షలు మంజూరు చేయించి పోతనపల్లి రోడ్డుకు తోలిన మెటల్ కూడా ఫారెస్ట్ వారు ఎత్తుకుపోవడం గమనార్హం. గడచిన 18 సంవత్సరాల నుండి ఆ రోడ్లకు ఎంత ప్రాధా న్యత ఉన్నప్పటికీ అటవీ శాఖ అభ్యంతరం వలనే రెండు చోట్లరోడ్లు నిర్మాణం ఆగిపోయాయి. ఆశ్చర్య కరమైన అంశం ఏమంటే చీపురుగూడెంలో వివాదాస్పదమైన కోళ్ల ఫారం అడవి అదే రోడ్డు పక్కన నిర్మించడానికి అటవీ శాఖలో అనుమతులు ఎలా వచ్చాయి? రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఎందుకు రావడం లేదు అనేది ఆసక్తికరమైన చర్చగా మారింది. ప్రైవేట్ వ్యక్తులకు ప్రోత్సాహకరంగా అధికారులపై పైరవీ చేసే నాయకులు రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అడ్డంకులను ఎందుకు నిలవరించలేకపోతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. పేద ప్రజలు సాగు చేసుకునే భూముల పైన ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించే రోడ్లపైన అటవీ శాఖ అధికారులకు ఉన్న శ్రద్ధ ప్రైవేటు వ్యక్తులు వేలాది ఎకరాలు ఆక్రమించుకునేటప్పుడు ఎందుకు చోద్యం చూస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చంద్రబాబు కృషి

- ఎన్టీఆర్ స్ఫూర్తితో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం
- మహిళల గౌరవం పెంచేందుకు మంత్రి లోకేష్ చర్యలు
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- 44వ డివిజన్లో ఎన్టీ రామారావు విగ్రహావిష్కరణ
- మహిళలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం సిటీ : సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అని నినదించిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. 44వ డివిజన్లో తెలుగు యువత నాయకులు వంజరపు శంకర్ నెలకొల్పిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పాల్గొన్నారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆద్యుడు అన్న నందమూరి తారక రామారావు అని కొనియాడారు. ఎన్టీఆర్ చూపిన బాటలో నడుస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పేదల జీవితాల్లో వెలుగులు నింపేం దుకు వాటిని కొనసాగిస్తున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒకటొకటిగా నెరవేరుస్తోందని, దీపం పథకంలో మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని, మే నెల నుంచి తల్లికి వందనం ద్వారా పిల్లలకు రూ.15 వేలు అందచేస్తారని చెప్పారు. రాజమండ్రిలో వైసీపీ నాయకుడు ఎన్నికల ముందు ఓట్ల కోసం హడావిడిగా పట్టాలు ఇచ్చి మోసం చేశాడని విమర్శించారు. తాను మాత్రం త్వరలో కానవరంలోని స్థలంలో పదివేల పట్టా లకు చట్టబద్ధత కల్పించి ఇస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీని వాస్ హామీ ఇచ్చారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠ్యపుస్తకాలు మహిళలు మాత్రం ఇంటిపని, వంటపని చేస్తున్నట్లుగా ఉండే ఫోటోలే కాకుండా మగవారు కూడా ఆ పనులు చేస్తున్న ఫోటోలు ముద్రించేందుకు చర్యలు చేపట్టన్నారని వివరించారు. రాజమండ్రి సిటీ నియోజకవర్గం మహిళల స్వయం ఉపాధికి 801 కుట్టు మిషన్లు మంజూరయ్యాయని, ఐదేళ్లలో 4,000 కుట్టు మిషన్లు మహిళలకు అందచేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, ఐదుగురు అవసరార్థులకు బియ్యం అందచేశారు. టీడీపీ నగర ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య అధ్యక్షతన జరిగిన సభలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, క్లస్టర్ ఇన్చార్జి కంటిపూడి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు పాలవలస వీరభద్రం, జవ్వాది విజయలక్ష్మి, పాలవలస బ్రహ్మాజీ, టీడీపీ నాయకులు మళ్ళ వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు

విద్యా పరికరాల అందజేత

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం, మురమండ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అరవై మంది పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు మంగళవారం కూటమి నాయకులు వట్టికూటి జానకి రామయ్య (దత్తుడు) విద్యా పరికరాలు అందజేశారు. స్థానిక నాయకులు మురమండ సాగునీటి సంఘం అధ్యక్షుడు గన్ని రామారావు, విద్యా కమిటీ చైర్మన్ కాటే జ్యోతి బాబు తదితరులతో కలిసి పరీక్ష ప్యాడ్, పెన్నులు తదితర వస్తువులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొండాడ సుధ మాట్లాడుతూ గ్రామ పెద్దలు విద్యార్థులకు పరికరాలు అందజేయడం చాలా సంతోషమని, పెద్దల ఆశీస్సులు మేరకు విద్యార్థులు చదువులో రాణించి, ఉన్నత స్థితికి ఎదగాలని కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మీరాబాయి, చాట్రాది బుజ్జిబాబు, తూలూరి శేషబాబు, పిల్లా వెంకట్రావు బత్తుల చిన గణేష్, ఉపాధ్యాయులు వివియస్ఎన్‌బి గంగాధర్, ఎవియస్‌మూర్తి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - కొవ్వూరు : సమాజ సేవలో లైన్స్ క్లబ్ సభ్యులు భాగస్వాములు కావాలని కాక రాల వేణుబాబు పిలుపు నిచ్చారు. అధికారక పర్యట నలో భాగంగా మంగళవారం కొవ్వూరు లైన్స్ క్లబ్ కు విచ్చేసిన డిస్టిక్ గవర్నర్ కాకరాల వేణు బాబుకు కొవ్వూరు లైన్స్ క్లబ్ అధ్యక్షులు మద్దిపాటి సత్య నారాయణ ఘన స్వాగతాన్ని పలికారు. ఈ సందర్భంగా కొవ్వూరు పట్టణ పరిధిలోని నిరుపేదలైన మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిస్టిక్ గవర్నర్ కాకరాల వేణుబాబు మాట్లాడుతూ కొవ్వూరు లైన్స్ క్లబ్ లో ఉత్సాహవంతమైన సభ్యులు ఉన్నారని రానన్న రోజుల్లో క్లబ్బు మరింత అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో నామాన బుల్లి రాజు, సూరప నేని చిన్ని, పాలెంపటి చినబాబు చౌదరి, యనమదల సుబ్రహ్మణ్యం, గార పాటి శ్రీనివాసరావు, మన్యం బుల్లిబాబు, పెనుమాక జయరాజు, కంటమణి రామ కిషోర్, పరిమి హరిచరణ్,గోలి వెంకటరత్నం, పిచ్చుకల సత్యనారాయణ , తదితర లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

కన్నుల పండుగగా నరసన్న తీర్థమహోత్సవం

విశాలాంధ్ర - సీతానగరం, రాజానగరం : హిందువులు అత్యంత పవిత్రంగా కొలుచుకొనే కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి (నరసన్నవారి తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభించారు. నియోజకవర్గం లోని కోరుకొండ గ్రామంలో స్వయంభుగా వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి తీర్థ మహోత్సవ వేడుకలు ఐదు రోజులు పాటు వైభవంగా జరగనున్న నేపథ్యంలో తొలి రోజు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి ముఖ్య అతిథిలుగా హాజరై వేడుకలు ప్రారంభించి రథోత్సవంలో పాల్గొన్నారు. వేకువ జాము నుండే ఆలయ అర్చకులు వేదపండితులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే భత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్, టీడీపీ ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ తనయుడు పెందుర్తి అభిరామ్, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వివిధ రాజకీయ పార్టీలకి చెందిన నేతలు,అధికారులు విచ్చేసి స్వామి వారి దీవెనలు అందుకున్నారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్వామివారి పల్లకి మోస్తూ గ్రామ వీధులలో ఊరేగింపుగా వెళ్ళారు. అనంతరం స్వామి రథోత్సవంలో భాగంగా కొబ్బరి కాయ కొట్టి తాళ్లతో రథాన్ని అశేష భక్త జనులతో కలిసి ముందుకు లాగి రథోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గం ప్రజలందరూ సుఖంగా సంతోషంగా హాయిగా ఉండాలని అలాగే స్వామి వారి అనుగ్రహం అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి మార్గాని సోదరుల విరాళం

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం వీరవరం గ్రామంలో శ్రీలక్ష్మి గణపతి నందీశ్వర ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ పునః ప్రతిష్ఠ, శ్రీ చౌడేశ్వరి అమ్మ వారి నూతన విగ్రహ ప్రతిష్ఠ కోసం ప్రముఖ నర్సరీ రైతులు మార్గాని సత్యనారాయణ సోదరులు రూ.1,01,116 విరాళం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు మార్గాని సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని రైతు సేవ కేంద్రముల వద్ద రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి జే భార్గవ్ మహేష్ తెలిపారు. రైతు సేవ కేంద్రాలలోని బ్యాటరీ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్, ట్రాక్టర్‌తో ఉపయోగించే పనిముట్లు, రోటవేటర్, పవర్ వీడర్, పవర్ టిల్లర్/ కృషీ ట్రాక్టర్, మొదలగు యంత్ర పరికరాలు రైతులకు రాయితీపై అందజేస్తారు.

రాయితీ పై వ్యవసాయ యంత్ర పరికరాలు తీసుకొనుటకు కలిగి ఉండవలసిన అర్హతలు 1. రాష్ట్రం మొత్తంలో రైతుకి 4.99 ఎకరాలు భూమి మాత్రమే ఉండాలి, 2. రైతు గత 3 సం.లో ఒక సారి అయిన రైతు సేవ కేంద్రం నందు ఈ పంట నమోదు అయ్యి ఉండాలి. 3. సొంత భూమి ఉన్న రైతులకి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. కౌలు రైతులకు ఈ పథకం వర్తించదు. 4.కుటుంబంలో ఒక రైతుకి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. 5. జెఎజ గ్రూప్ నందు యంత్రాలు తీసుకున్న రైతుకి ఈ పథకం వర్తించదు.,6. తీసుకునే రైతుకి వెబ్ ల్యాండ్ నందు భూమి వివరాలు ఖచ్చితంగా నమోదు అయ్యి ఉండాలి. లేని పక్షంలో ఈ పథకానికి అర్హులు కారు. మరిన్ని వివరాల కోసం మీ దగ్గరలోని రైతు సేవ కేంద్రమును సంప్రదించగలరుని అసిస్టెంట్ డైరెక్టర్ వి రామారావు, మండల వ్యవసాయాధికారి జే భార్గవ్ మహేష్ తెలిపారు.

భూసార పరీక్షలతో రైతులకు అధిక మేలు

- వేసవి పంటలపై రైతులు దృష్టి సారించాలి
- జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు

విశాలాంధ్ర - రాజానగరం : తమ పంట పొలాల్లో రైతులు తప్పనిసరిగా భూసారా పరీక్షలు చేయించుకోవాలనీ తద్వారా ఎరువులు వాడకం తగ్గి అధిక మేలు చేకూరుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి షేక్ ఇమామి ఖాసీం ఆధ్వర్యంలో చక్రద్వారబంధం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం లో పోషక ఆహార భద్రత పథకం అనే అంశంపై మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భూసారా పరీక్షల ఫలితాల అనుగుణంగా తమ పంట పొలాల్లో ఎరువుల యాజమాన్యం చేపట్టాలని రైతులను కోరారు. జీలుగా, జనుము, పిఎండిఎస్ విత్త నాలు చల్లడం ద్వారా నేలను అధిక ఉష్ణోగ్రత నుండి కాపాడుకోవచ్చని, తద్వారా నేల గుల్ల బారి వానపాములు వృద్ధి చెందడం, నేలలో నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు జయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి షేక్ ఇమామి ఖాసీం, హెచ్ఈవో అరవింద్ సాయి,గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రతాప్, రైతులు, జనసేన గ్రామ అధ్యక్షులు ఆనందాల గోవిందు, కురమళ్ళ మహేష్,ఎన్డీఏ కూటమి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్ అండ్ గైడ్స్ ట్రైనింగ్‌తో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చు

విశాలాంధ్ర - కడియం : స్కౌట్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ వల్ల విద్యార్థులు ఉత్తమ పౌరులుగా తయారవుతారని తూర్పుగోదావరి జిల్లా సర్వ శిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సుభాషిని అన్నారు. రెండవ రోజు స్కౌట్ అండ్ గైడ్స్ పెట్రోల్ లీడర్ ట్రైనింగ్ క్యాంప్ ను ఏఎంఓ గౌరీ శంకర్, సీఎంఓ శ్రీనివాస్‌తో కలిసి ఆమె పరిశీలించారు. స్కౌట్ క్యాంప్ లో ఉన్న విద్యార్థులకు కల్పించిన వసతుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపు డైరెక్టర్ టి సత్యనారాయణ, జిల్లా స్కౌట్ కార్యదర్శి రాజ్ కుమార్, ఏఎల్టి నారాయణమూర్తి, ధనలక్ష్మి, స్కౌట్ టీచర్స్ కల్పన, గిరిజ, జ్యోతి పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం
జీవో జారీపై ప్రభుత్వ విప్ దాట్ల హర్షం

విశాలాంధ్ర - కాట్రేనికోన : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా ఇళ్లు నిర్మించుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనపు సాయం చేయడంపై ప్రభుత్వం జీవో జారీ చేసినట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మంజూరైన ఇళ్లకు ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50,000, ఎస్టీలకు రూ.75వేలు, గిరిజనులకు రూ. 1 లక్ష అదనపు సాయం అందిస్తారని తెలిపారు. దీనికి తోడు ఎస్‌హెచ్‌జి సభ్యులకు జీరో వడ్డీపై రూ.35వేల రుణం అందిస్తామన్నారు. గృహ లబ్ధిదారులకు అదనపు సాయం అందిస్తూ ప్రభుత్వ జీవో జారీ చేయడం పట్ల ఎమ్మెల్యే దాట్లహర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆదిత్య యూనివర్సిటీలో "మేథో సంపత్తి హక్కుల" అవగాహన సదస్సు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఐ-ఎంఎస్ఎంఈ పథకం, ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ (సూక్ష్మ,చిన్న, మధ్య తరహా సంస్థలు) డెవలప్మెంట్ కార్పొరేషన్ మేథో సంపత్తి హక్కుల ఆధ్వర్యంలో ఆదిత్య యూనివర్సిటీలో వర్కుషాప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఆఫ్ డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్, సిహెచ్ గణపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం నొవెల్ పేటెంట్ సర్వీసెస్ మేనేజర్ ఎస్‌వివిఎస్ రాజు, మాట్లాడుతూ విద్యార్థులకు, ఎంఎస్ఎంఈ కంపెనీ ప్రతినిధులకు ఐపిఆర్ గురించి అవగాహన, ఐపిఆర్ సాధనాల సమర్థవంతమైన వినియోగం గురించి వివరించారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మేథో సంపత్తి హక్కుల గురించి మరియు వ్యాపార వ్యూహాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో కెరీర్ డెవలప్మెంట్ డీన్ ప్రొఫెసర్ జెడి వెంక టేష్, ఐపిఎఫ్‌సి కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ యస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్

విశాలాంధ్ర - జగ్గంపేట : విద్యా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చెన్నారావు ఆధ్వర్యంలో మంగళవారం అకడమిక్ ఆడిట్ నిర్వహించారు. కళాశాల విద్యాశాఖ నియమించిన కాకినాడ పిఆర్ ప్రభుత్వ కళాశాల హింద్ ఆధ్యాపకులు పి హరిరామ్ ప్రసాద్, తుని ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు ఎ పుష్పలత అకడమిక్ అడ్వైజర్స్‌గా హాజరై అధ్యాపకులందరికి మార్గనిర్దేశకత్వం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కళాశాల ప్రత్యేకతలు బోధనకు సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ బాల రాజు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్. పివివి సత్యా నారాయణ, అకడెమిక్ కో-ఆర్డినేటర్ పి విశ్వశ్వర్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజపూడిలో జయహో మహిళ

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని రాజపూడిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జయహో మహిళ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజపూడి సెక్టార్ సూపర్ వైజర్ అమ్మాజీ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాజెక్టు అధికారి పూర్ణిమ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఉపాధ్యాయురాలు, డాక్టర్ రైతు, పోలీసు, లాయర్, రాజకీయ వేత్త, బ్యూటిషన్, కండక్టర్, ఉద్యోగి, అంగన్వాడీ టీచర్ వేషధారణలు వేశారు. ఈ కార్యక్ర మంలో యూడిసి అనంత లక్ష్మీ, బిపిసి శ్యామల దేవి, అంగన్వాడీ సూపర్ వైజర్స్ సునీత, బూసమ్మ, కరీ మున్నిసా, పార్వతి పాల్గొన్నారు.

కందికుప్ప రోడ్డుకు మోక్షం

విశాలాంధ్ర - కాట్రేనికోన : కూటమి ప్రభుత్వం పుణ్యమా అంటూ ఎన్నో ఏళ్ల నాటి రోడ్డుకు మోక్షం కలిగింది. మండలంలోని కందికుప్ప గ్రామ సెంటర్లో ఆర్ అండ్ బి రోడ్డును ఇటీవల అభివృద్ధి చేయడంతో పలు గ్రామాల ప్రజల సమస్య తీరింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చొరవతో దాదాపు 30లక్షల రూపాయలు మంజూరు కావడంతో ఇక్కడ రోడ్డుకు పడిన గండిని పూడ్చి సిసి రోడ్డుగా తీర్చిదిద్దారు. కొన్ని సంవత్సరాలుగా ఏ చిన్నపాటి వర్షం వచ్చినా కందికుప్ప సెంటర్లో దిగబడిన రోడ్డు చెరువులా మారడంతో మోకాలు లోతు మురుగునీటిలో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను ఎన్నిసార్లు విన్నవించినా నిధుల లేమి సాకుతో గత ప్రభుత్వంలో పాలకులు నిర్లక్ష్యం వహించారనే చెప్పాలి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఎన్నికల హామీగా నిలిచిన కందికుప్ప రోడ్డు సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే దాట్లను స్థానికులు అభినందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాకతో తమ సమస్య తీరిందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యువసేన బ్లడ్ బ్యాంక్‌లో ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడలో ఉన్న యువసేన బ్లడ్ బ్యాంక్‌కి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా జె నరసింహ నాయక్, జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా రిజిస్టర్లు అన్ని పరిశీలించి, ప్రజల నుంచి వసూలు చేస్తున్న చార్జీల వివరాలు ఆరా తీశారు. పేషెంట్ రిక్విజేషన్ ఫామ్ తీసుకుని ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పేషెంట్ పేమెంట్ రిసిప్ట్ ఇష్యూ రిజిస్టర్స్ అన్ని సక్రమంగా ఉన్నాయని డీఎం అండ్ హెచ్ఓ తెలిపారు. బ్లడ్ బ్యాంకులో మెయింటైన్ చేస్తున్నటువంటి రిజిస్టర్ లన్నియు పరిశీలించారు. బ్లడ్ స్టాక్ రిజిస్టర్, డోనర్ రికార్డ్, క్యాంప్ రిజిస్టర్స్ ,క్రాస్ మ్యాచింగ్, డిస్కార్డ్ రిజిస్టర్, బ్లడ్ ఇష్యూ రిజిస్టర్, పేషెంట్ రిక్విజేషన్ ఫామ్, పేషెంట్ రిసీప్ట్, మరియు ఫిజికల్ స్టాక్ క్రాస్, గవర్నమెంటు బ్లడ్ బ్యాంక్ ఇచ్చిన 30% బ్లడ్ మంత్లీ డోనర్స్ అండ్ మంత్లీ ఇష్యూ రిజిస్టర్, బ్లడ్ కలెక్షన్ రూమ్ క్రాస్ మ్యాచింగ్ రూమ్ కాంపోనెంట్ ప్రిపరేషన్ రూమ్ వైరల్ స్క్రీనింగ్ రూమ్ పరిశీలించినట్టు ఆయన తెలిపారు.

అనుమతులు లేకుండా మద్యం అమ్మితే కఠిన చర్యలు
ఎస్సై రవికుమార్

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కోనసీమ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ ఆధ్వర్యంలో మండపేట రూరల్ సీఐ సమాచారం మేరకు వడ్లమూరు ఊరు చివరన కొల్లాటి సురేష్, వడ్లమూరు గ్రామం అను వ్యక్తి ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా 10 మద్యం సీసాలను అమ్ముతుండగా అంగర ఎస్సై వారి సిబ్బందితో కలసి పట్టుకుని అతని పై కేసు నమోదు చేశారు. ఎటువంటి అనుమతి లేకుండా మద్యం అమ్మేవారు పై కఠినమైన చర్యలు తప్పవు అని అంగర ఎస్సై రవికుమార్ సూచించారు.

భక్తులకనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తాం
ఎమ్మెల్యే సత్యానందరావు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని వాడపల్లి గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం రాష్ట్రంలో ప్రసిద్ధ క్షేత్రంగా విరాజిల్లు తోంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నాము' అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి ఆలయంలో వివిధ పనులకు సోమవారం ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించి క్షేత్రంలోని పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, భక్తుల సమస్యల పరిష్కారంపై వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులతో చర్చించారు. రూ.3.80కోట్లతో వకుళమాత అన్నప్రసాద భవన పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. గోశాల నిర్మాణం, తాత్కాలిక అన్నదాన షెడ్డు వద్ద ఫ్లోరింగ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కోనేరు నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని, దార్మెట రీలు, క్యూలైన్ల పనులు శర వేగంగా చేస్తున్నామన్నారు. కాటేజీల నిర్మాణానికి దాతల సహకారం కోరుతున్నామని, పనులకు త్వర లోనే శ్రీకారం చుడతామన్నారు. దశల వారీగా అభివృద్ధి పనులు చేపట్టి భక్తుల ఇబ్బందులను పరిష్కరి స్తామన్నారు. వివిధ శాఖల అధికారులు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, సీఐ సిహెచ్ విద్యాసాగర్, తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకట రామన్, ఎస్ఐ ఎస్ రాము, క్లస్టర్ ఇన్చార్జిలు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహారావు, ముళ్ల పూడి బాస్కరరావు, కాయల జగన్నాథం, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు సాయం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామ పరిధి రంగాపురం బాబునగర్‌లో అగ్ని ప్రమాద బాధితులకు మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ పుణ్యమంతుల రజని ఆధ్వర్యంలో చల్లపల్లి, సింగరాయపాలెం, అనాతవరం సభ్యులు సమకూర్చిన నిత్యావసర వస్తువులు, వస్త్రాలు అందజేసి బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా పుణ్యమంతుల రజని మాట్లాడుతూ మనవతా దృక్పథంతో సభ్యుల సహకారంతో ఫౌండేషన్ తరపున అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, అలాగే దాతలెవరైనా మరింత మంది ఇలా సాయం చేయడానికి ముందుకొస్తే బాధితులకు భరోసా లభిస్తుందన్నారు. తమవంతుగా సాయం చేయడానికి ముందుకొచ్చిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రాల సుజాత, జంగా తనూజ, అయితాబత్తుల భీమాబాయి, అయితాబత్తుల మంగ, కందేరి మణి తదితరుల పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డియం ప్రోగ్రాం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం ఆర్‌టిసి డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై 12వ తేదీ బుధవారం డయల్ యువర్ డియం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 11:00 నుండి 12:00 గం.ల. వరకు నిర్వహించబడుతుందని ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను 958193 2678 సెల్ నంబరుకి ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

ఆర్‌జెడి నాగమణికి యంగ్‌మైన్స్ సభ్యుల అభినందనలు

విశాలాంధ్ర - కాకినాడ : ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి నాగమణిను యంగ్‌మైన్స్ రేపటి కోసం టీం సభ్యులు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమెను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఈ సందర్భంగా యంగ్‌మైన్స్ వాకాడ వీరవెంకటరమణ(చిన్న మాస్టారు) మాట్లాడుతూ మహిళలు అన్నింటా ముందు ఉండాలని, మహిళా మేలుకో జగతిని ఏలుకో అనే పథమును అందరూ సాత్కారం చేసేలా ప్రయత్నం చేయాలని, మహిళలకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమాలను ఉపాధ్యాయులందరూ చేయాలని, ప్రతి మహిళా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అమానుష సంఘటనలను తీవ్రంగా ఖండించారు. యంగ్ మైన్స్ ఫౌండర్ వాకాడ వీర వెంకట రమణ, సిటీఆఫ్ లెటర్స్ కార్యక్రమాల గురించి వివరించారు. యంగ్‌మైన్స్ చేపట్టే కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ డీవీవీ బాపిరాజు, కో ఆర్డినేటర్ ఎం కామేశ్వరరావు, జివి రంగనాథ్, ఎంవివి సత్యనారాయణ, ఎంకే చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని కాండ్రేగులలో మంగళవారం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా పడింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేటకు చెందిన ఓ ప్రైవేట్ విద్యా సంస్థల బస్సు విద్యార్థులను తీసుకొచ్చేందుకు వెళ్ళి వస్తుండగా మార్గ మధ్యంలో పంది అడ్డు రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ కొట్టాడు. దాంతో అదుపు తప్పి బస్సు బోల్తా పడింది. ఈ బస్సులో 13 మంది విద్యార్థులు ఉండగా 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలు అయిన విద్యార్థులను స్థానిక సీహెచ్‌సికి తరలించి చికిత్స అందజేశారు. ఈ ఘటన పై స్థానిక ఎస్సై రఘునాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్‌లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఆసుపత్రి ప్రధాన వైద్యులు ప్రణీత్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

ఎమ్మెల్యే సత్యప్రభ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ త్వరగా కోలుకో వాలని కోరుకుంటూ ఏలేశ్వరం మండల తెలుగుదేశం పార్టీ శ్రేణులు మండలంలోని యర్రవరంలో ప్రసన్నాం జనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ టీడీపీ నాయకులు బస్వా ప్రసాద్, మైరాల కనకారావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి, మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, నగర పంచాయతీ నాయకులు బొదిరెడ్డి గోపి హాజర య్యారు. ముందుగా ప్రసన్నాంజనేయ స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి ప్రజా అభిమాన నేత ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ త్వరగా కోలుకోవాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అరక రాజు, బుద్ధ సూర్య ప్రకాష్, దనేకుల భద్రరావు, జిగటాపు సూరిబాబు, పలివెల శ్రీను, పలివేల వెంకటేశ్వ రరావు, తోట వెంకటేశ్వరరావు, నూకతాటి ఈశ్వరుడు పలువురు ఎన్డీఏ కూటమి నేతలు హాజరయ్యారు.

కుష్టు వ్యాధి రహిత సమాజం నిర్మిద్దాం

విశాలాంధ్ర - అమలాపురం : మానవ సేవే మాధవ సేవగా పెద్దలు చెబుతారని "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" చైర్మన్, మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. రామచంద్రపురం సువార్త పేటలో కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగం గా అంగవైకల్యం, నివారణ, చికిత్స కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ ఎం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. లెప్రసి కాలనీలో ఉన్న సమస్యలన్నిటిని తక్షణం పరిష్కరి స్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సువార్తపేట కాలనీలో నివాసం ఉంటున్న 36 బాధిత కుటుం బాలకు వారి అనారోగ్యం రీత్యా వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా పది రోజుల్లోగా వేయిస్తానని సత్యం హామీ ఇచ్చారు. ఏ సమస్యలున్నా నేరుగా మంత్రి సుభాష్ లేదా తమ ఫౌండేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించిన రామచంద్రపురం నియోజవర్గ ప్రజల ఋణం తీర్చుకునే క్రమంలో పలు సేవా కార్యక్ర మాలు మంత్రి సుభాష్ తమ ఫౌండేషన్ ద్వారా చేపడుతున్నారని తెలి పారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కుష్టి వ్యాధి నిర్మూలన కోసం ప్రభుత్వం అవ గాహన కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. దుప్పట్లు, దాతలు సమకూర్చిన పండ్లు, రొట్టెలను ముఖ్య అతిథి వాసంశెట్టి సత్యం పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, మున్సిపల్ డివిజనల్ ఇంజనీర్ శ్రీకాంత్, లెప్రసి జిల్లా నోడల్ అధికారి చిక్కాల సూర్యరావు, ఫిజియోథెరపిస్ట్ రంగనాథం, గౌరీ శంకర్, జేపీసీ సభ్యులు పాల్గొన్నారు.

150 కేజీల గంజాయి పట్టివేత

- ఐదుగురు అరెస్టు
- ఏడు లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం
- జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్

విశాలాంధ్ర - రాజానగరం : తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు అర్జించవచ్చని అడ్డ దారులు తొక్కుతూ, యువత తమ ఉజ్వల భవి ష్యత్తు నాశనం చేసుకుంటున్నారు. పోలీస్ వ్యవస్థ ఎన్నిసార్లు అవగాహన కల్పించిన వాటిని పెడచె వున్న పెడుతూ కొంతమంది యువకులు గంజాయి వంటి మాదకద్రవ్యాలు తరలిస్తూ పోలీసులకు చిక్కి కటకటాల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా రాజానగరం పోలీసు స్టేషన్ పరిధి లోని కొంతమూరు గ్రామ శివారులో మంగళవారం జరిగిన వాహన తనిఖీల్లో భారీ ఎత్తున గంజాయిని రాజానగరం పోలీసులు చాకచక్యంగా పట్టుకు న్నారు. ఇందుకు సంబంధించి రాజమహేంద్రవరం నందు మంగళవారం జరిగిన విలేకరుల సమావే శంలో తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ తమకు వచ్చిన పక్కా సమాచా రం మేరకు రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ ను అప్రమత్తం చేయగా, రాజానగరం ఎస్ఐ పి.మనోహర్ నేతృత్వంలో కొంతమూరు గ్రామ పరిధిలోని ఎయిర్‌పోర్ట్ రోడ్లోని కొంతమూరు అం డర్ బ్రిడ్జి వద్ద పోలీసులు వేకువ జాము నుండి వాహనాలు తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు. దీంతో ఏపీ39టీహెచ్ నంబర్ గల ఆటో ముందస్తుగా రావడం, తమ పోలీసులను చూసి ఆగిపోవడం గుర్తించినట్లు చెప్పారు. అలాగే ఏపీ39ఏ 3333 నంబర్ గల స్విఫ్ట్ డిజైర్ కారులో గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. సోదా చెయ్యగా కారు డిక్కీలో 150 కేజీల గంజాయి, ఒక్కొక్క ప్యాకెట్ 2 కేజీలు చొప్పున మొత్తం 75 ప్యాకెట్లు కారు డిక్కీలో తరలి స్తున్నట్లు చెప్పారు. పోలీస్ తనిఖీల గురించి ముం దస్తు సమా చారం ఇచ్చేందుకు పైలట్ గా వ్యవహరించేలా ఏపీ39టీహెచ్ నంబర్ ఆటోను గుర్తించడంతో గంజాయిని పట్టుకున్నట్లు చెప్పారు.

ఐదుగురు అరెస్టు

రంపచోడవరం నుండి ఐదుగురు యువకులు అక్రమంగా తరలిస్తున్న 150 కేజీల గంజాయినీ రాజానగరం ఎస్ఐ పి మనోహర్ కొంతమూరు గ్రామ శివార్లో మంగళవారం వేకువ జామున పట్టుకున్న నిందితుల పేర్లు ఈ విధంగా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కంభం గ్రామానికి చెందిన షేక్ ఇంతియాజ్ (35),ప్రకాశం జిల్లా సింగరాయికొండ గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ సలీం ఏ అలి యాస్ సలీం(40),రంపచోడవరం గ్రామానికి చెందిన సంకురు బుచ్చి రెడ్డి(24),రంపచోడవరం గ్రామానికి చెందిన ముర్ల చిన్నారెడ్డి ఏ జెట్టీ(24), రంపచోడవరం గ్రామానికి చెందిన ఉలుగుల రవి కిరణ్ రెడ్డిఏపిఐదు(27) తొ పాటు స్విఫ్ట్ డిజైర్ కారు,ఆటో ,ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసు కున్నామని ఎస్ఐ మనోహర్ చెప్పారు. సదరు గంజాయిని ఎవరి వద్ద కొన్నది, ఎవరికి అమ్మవచ్చు నన్నది తదుపరి దర్యాప్తులో తెలుసుకుని వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఉత్తర మండలి డీఎస్పీ వై. శ్రీకాంత్,రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్, ఎస్ఐ పి.మనోహర్, కానిస్టేబుల్స్ రమణ ,

విజయవంతంగా జనసేన ఆవిర్భావ సభ సమావేశాలు

- మూడు రోజుల్లో 24 గ్రామాలను పర్యటించిన ఆవిర్భావ సభ సమన్వయకర్త పివిఎస్ఎన్ రాజు
- పార్టీ శ్రేణులు సభను విజయవంతం చేయాలని పిలుపు

విశాలాంధ్ర - పిఠాపురం : జనసేన పార్టీ ఆవిర్భావ సభ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గం సమన్వయకర్త విశాఖ జిల్లా చోడవరం జనసేన పార్టీ ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు మూడోరోజు పర్యటనలో భాగంగా చిత్రాడ, నవకండ్రవాడ, మాధవపురం, బి ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తి, రాయవరం గ్రామాలను పలువురు మండల నాయకులతో కలిసి సందర్శిం చారు. ఈ పర్యటనలో ఆయన పలువురు గ్రామ పార్టీ నాయకులను, సీనియర్ నాయకులను, వీర మహిళలను కలిసి పవన్ కళ్యాణ్ నాయకత్వం పిఠాపురం నియోజవర్గం అభివృద్ధి పథంలో ఎలా దూసుకుపోతుందో వారి ద్వారా తెలుసుకొని పూర్తిస్థాయిలో ఈ సభను విజయవంతం చేయడానికి ప్రజలందరినీ భాగ స్వాములు చేయాలని సూచించారు. ఈనాటి సమావేశాల్లో పలువురు పార్టీ నాయకులు, జనసైనికులు పాల్గొని పవన్ కళ్యాణ్‌కి మద్దతుగా నిలుస్తామని జనసేన పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలియ జేశారు. ఆయా గ్రామాల నాయకులతో ఆవిర్భావ సభ కరపత్రికలను అందజేశారు. ఈ పర్యటనలో ఏలేరు ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ పూటా ఆదివిష్ణు , ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, జనసేన నాయకులు వెన్నా జగదీష్, వెన్నపు చక్రధరరావు, పిల్లా దినేష్, తుమ్మలపల్లి చందు, కురుమళ్ల రాంబాబు సిగటాపు నారాయణరావు, ఎంపీటీసీ దూలపల్లి రత్నం సంధ్యాల జాన్, దేశిరెడ్డి సతీష్, దూలపల్లి నాగబాబు, బసవ గోపి, కోటిపల్లి కాశీ విశ్వనాథ్, పెంట వెంకటేష్, తేలు శ్రీనివాస్, వెంకటేష్, నాయుడు మణికంఠ, వెన్న రాంబాబు, పేర్నిడి వెంకట్రావు, కండవల్లి రమణ, కుక్కల బాబు, యాగ సతీష్, ఆకుల దుర్గ, మేడిశెట్టి, నాగమణి, నాగిని, అరుణ, అమ్మాజీ, కందా సత్యనారాయణ, కోన లోవరాజు, నాగలోవబాబు, పిల్లి శ్రీనివాస్, దుర్గబాబు, జనసేననాయకులు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

తూ.గో.జిల్లా, కొవ్వూరు మండలం, వాడపల్లి గ్రామములోని పుట్లాలమ్మ వీధి వాస్తవ్యుడను అయిన **కరుటూరి వీర వెంకట రామారావు (తండ్రి: లేటు సత్యనారాయణ)** అను నేను మా తండ్రి గారు అయినటువంటి కరుటూరి సత్యనారాయణ గారి పేరున కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో **డాక్యుమెంట్ నెం: 1899/1996** నెంబరుతో రిజిస్టర్ కాబడిన ఒరిజినల్ డాక్యుమెంట్‌ను జిరాక్స్ నిమిత్తం తీసుకువెళ్ళగా మార్గమధ్యంలో పోయినది. (మా తండ్రి గారు: అయినటువంటి కరుటూరి సత్యనారాయణ గారు: **డి. 21-08-2007**న మరణించియున్నారు)

కావున పై ఒరిజినల్ దస్తావేజులు దొరికిన యెడల ఈ క్రింది తెలిపిన అడ్రస్సుకు లేదా ఫోన్ నెంబరుకు తెలియజేయగలరని విజ్ఞప్తి చేస్తున్నాను.

కరుటూరి వీర వెంకట రామారావు
డోర్ నెం: 4-42
పుట్లాలమ్మ వీధి, వాడపల్లి గ్రామం,
కొవ్వూరు మండలం. సెల్: 94401 27499.

ఆర్గానిక్‌తో ఆరోగ్యం : ఎంపీడీవో



విశాలాంధ్ర - గండేపల్లి : ఆర్గానిక్ ఆకుకూరలు వాడటం ఎంతో ఆరోగ్యకరమని చిన్నపిల్లలకు వాటిని పెట్టడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ అధ్యక్షులు చలగళ్ళ పద్మనాభుడు (దొరబాబు) ఎమ్ పిడివో నాతి బుజ్జి, మండల పరిషత్ కార్యాలయ ఆవరణములో ఎటు వంటి రసాయన ఎరువులు వాడకుండా పెంచిన ఆకు కూరలను గండేపల్లి గ్రామంలో మూడు అం గన్ వాడీ సెంటర్లకు, ఉపాధి వేతన దారులకు ఆకు కూరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడియస్ సూపర్ వైజర్ నాగ పార్వతీ, ఏటి చంద్రరావు, ఈసీ రమేష్, అంగన్‌వాడీ టీచర్స్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్

విశాలాంధ్ర- రాజమండ్రి: ఫ్యాషన్, టెక్నాలజీ, వినోదాన్ని మిళితం చేసి వైజాగ్ లో బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ వైభవోపేతంగా జరిగింది. ఈ సాయం త్రం ఫ్యాషన్ భవిష్యత్తుకు జీవం పోస్తూ తమన్నా భాటియా షోస్టాపర్‌గా రన్‌వే పై నడవగా అక్షత్ బన్సల్ యొక్క బ్లోనీ యువతను ఆకట్టుకుంది. అద్భుతమైన ఆవిష్కరణలు ఆవిష్కృతమవుతున్నప్పుడు రిత్విజ్ యొక్క ప్రత్యక్ష సంగీత ప్రదర్శన ఉత్సాహాన్ని తారా స్థాయికి చేర్చింది. ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్ డీసీఐ) భాగస్వామ్యంతో నిర్వహించిన బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ వైజాగ్‌లో ఒక అద్భుతమైన ప్రదర్శనగా నిలిచింది. అక్షత్ బన్సల్ యొక్క కలెక్షన్ ఏఐ జనరేటెడ్ విజువల్స్, 3డీ మోడల్డ్ ఎలిమెంట్స్ , అత్యాధునిక వస్త్రాలతో రన్‌వేను విప్లవాత్మకంగా మార్చింది. తమన్నా భాటియా యొక్క షోస్టాపింగ్ వాక్ రన్‌వే ను సజీవంగా మార్చింది. చెఫ్ మొహమ్మద్ ఆషిక్ యొక్క ఆహ్లాదకరమైన వంటకాలు , రిత్విజ్ యొక్క హై ఎనర్జీ బీట్‌లు శైలి విశేషంగా అలరించాయి. ఎల్లప్పుడూ సృజనాత్మక సరిహద్దులను అధిగమించడం, ఫ్యాషన్‌ను ఒక కళా రూపంగా పునర్నిర్వచించడం గురించి బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ జరుగు తుందని అని పెర్నాడ్ రికార్డ్ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్, గ్లోబల్ బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ కార్తీక్ మోహింద్ర అన్నారు. బ్లోనీ వ్యవస్థాపకులు , డిజైనర్ అక్షత్ బన్సల్ ఈ షోపై తన ఆలోచ నలను పంచుకుంటూ, "ఫ్యాషన్ ఇకపై కేవలం దుస్తుల గురించి కాదుబీ ఇది ఆవిష్కరణ, సాంకేతికత, స్వీయ వ్యక్తీకరణ మధ్య అభివృద్ధి చెందుతున్న క్రాస్-కల్చరల్ సంభాషణ" అని అన్నారు. షోస్టాపర్ తమన్నా భాటియా మాట్లాడుతూ, "బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్‌లో బ్లోనీ కోసం షోస్టాపర్‌గా నడవడం ఒక అద్భు తమైన అనుభవం. అక్షత్ బన్సల్ యొక్క అద్భుతమైన కలెక్షన్, దాని వినూత్న మైన సాంకేతిక పరిజ్ఞానం ఒక అద్భుతం" అని అన్నారు. గాయకుడు రిత్విజ్ మాట్లాడుతూ, బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ లో ప్రదర్శన ఇవ్వడం ఒక అద్భు తమైన అనుభవమన్నారు 'ది వన్ అండ్ ఓన్లీ' ఎన్ వోగ్ అనుభవాల వేదికగా ఎలా రూపుదిద్దుకుంటుందో చూడటం ఉత్సాహంగా ఉంది" అని క్యూరేటర్ ఆశి ష్ సోని అన్నారు." ఫ్యాషన్ అనుభవాల భవిష్యత్తును రూపొందించడానికి తా ము కట్టుబడి ఉన్నామని ఎఫ్ డీసీఐ చైర్మన్ సునీల్ సేథి అన్నారు. ఈ ఫ్యాషన్ టూర్ ఇప్పుడు మార్చి 23, 2025న గౌహతి లో జరుగనుందని తెలిపారు.

మార్చి31 నాటికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు
సలహాలు, సూచనలు అందజేయాలి : కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : ఎన్నికల ప్రక్రియలను మరింత బలోపేతం చేయడానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు అవసరమైన సలహాలు, సూచనలు మార్చి31 నాటికి అందజేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రక్రియలో నూతన సంస్కరణలు తీసుకొచ్చే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం అన్ని జాతీయ, రాష్ట్ర పార్టీల నుంచి అవసరమైన సూచనలు సలహాలను ఆహ్వానించిందన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950, 1951, ఓటర్ల నమోదు నియమాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి వంటి ఇతర అంశాలపై ఎన్నికల సంఘం సూచనలను ఆహ్వానించిందని ఆయన తెలిపారు. ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడమే కాకుండా పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల్లో నిర్వహించేందుకు మార్చి31 లోపు అందించిన సూచనలు, సలహాలను ఈసీఐకి నివేదించడం జరుగుతుందన్నారు. ఈ సూచనలు, సలహాలపై భారతీయ ఎన్నికల సంఘం ఏప్రిల్ 30న అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల సభ్యులతో చర్చించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియలను మరింత బలోపేతం చేయడానికి కాకినాడ జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు అవసరమైన సలహాలు, సూచనలు ఈ నెల 31 నాటికి అందజేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కోరారు.

స్థానిక అధికారులకు అర్జీలు అందచేయాలి

కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎన్నికల కోడ్ ఎత్తివేయడం జరిగినా దృష్ట్యా గతంలో నిర్వహించే విధానంలో ఇకపై ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరుగుతుందని ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలియచేశారు. ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యయ ప్రయాసలు కోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని, క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండే డివిజన్ మండల స్థాయి అధికారులకు మీ అర్జీలు పరిష్కారం కోసం అందజేయాలన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి అందరూ జిల్లా స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ఫిర్యాదులను కలెక్టరేట్ లో స్వీకరిస్తామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. రెవెన్యూ, మునిసిపల్, మండల స్థాయి లో అర్జీలను క్షేత్ర స్థాయిలోని కార్యాలయాల్లో ప్రజా సమస్యలు పరిష్కార వేదిక లో అందచేయాలని కలెక్టర్ తెలియచేశారు.

బ్యాంకు రుణాల పంపిణీ మరింత ముమ్మరం చేయాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

విశాలాంధ్ర - కాకినాడ : వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు బ్యాంకు రుణాల పంపిణీ మరింత ముమ్మరం చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా , జిల్లా అధికారులను కోరారు. మంగళవారం కలక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో బ్యాంకులు, జిల్లా అధికారులతో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశాలు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధ్యక్షతన జరిగాయి. సమావేశంలో 2024-25 సంవత్సరానికి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక అమలులో భాగంగా వివిధ అంశాలలో సాధించిన ప్రగతి, లక్ష్య సాధన పూర్తి చేసేందుకు చివరి త్రైమాసంలో చేపట్టవలసిన కార్యచరణలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా గత డిశంబరు 31వ తేదీతో ముగిసిన త్రైమాసాంతం నాటికి వివిధ రంగాలకు అందించిన రుణాల ప్రగతిని సమీక్షిస్తూ వ్యవసాయ రంగానికి 11,460 కోట్ల రుణాలు కల్పన లక్ష్యానికి గాను 10,780 కోట్ల మేరకు రుణాలు కల్పించి 94.06 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు.సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి 4,183 కోట్లు రుణాలు జారీ లక్ష్యానికి గానూ 4,102 కోట్లు పంపిణీ చేసి 98.03 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. అలాగే ఇతర నాన్ ప్రియారిటీ రంగాలకు 4,184 కోట్లు రుణాల కల్పనకు గాను

లక్ష్యాన్ని మించి 5,872 కోట్లు పంపిణీ చేసి 140.34 శాతం సాధించడం ముదావహన్నారు. జిల్లాలో ఈ యేడాది ఇప్పటి వరకూ 15,599 మంది కౌలురైతులకు వక్తిగతంగా 55.48 కోట్లు, 20,495 మంది కౌలు రైతులకు ఆర్ఎంజి, జెఎల్జి గ్రూపుల ద్వారా మరో 79.48 కోట్లు పంట రుణాలు మంజూరు చేసారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్వావలంబన పథకాల ద్వారా వివిధ సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా 3,704 మంది లబ్దిదారులకు 4,568 కోట్లు రుణాలు కల్పన లక్ష్యం నిర్ధేశించడం జరిగిందని, ఈ లక్ష్యాన్ని బ్యాంకులు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు. అలాగే ఆయా సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా 57 జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు 50 శాతం బ్యాంకు రుణాలుగా 228 కోట్లు అందించాలన్నారు. డిఆర్డిఏ ద్వారా ఇప్పటి వరకూ 14,315 డ్వాక్రా గ్రూపులకు 1075 కోట్లు (62.14 శాతం), మెప్మా ద్వారా 4,312 డ్వాక్రా గ్రూపులకు 508 కోట్లు (240శాతం) బ్యాంకు రుణాల లింకేజీ అందించడం జరిగిందన్నారు. పియం విశ్వకర్మ యోజన ద్వారా ఇప్పటి వరకూ 3,801 ధరఖాస్తులు ఆమోదం పొందగా, వీరికి ఆయా నైపుణ్యాలలో శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పియం ఈజిపి పథకం ద్వారా 538 కోట్లు బ్యాంకు రుణంతో ఇప్పటు వరకూ 140 యూనిట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా గ్రౌండ్ అయ్యాయన్నారు. పియంఎఫ్ఎంఈ పథకం ద్వారా మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపనకు 10 లక్షల వరకూ ష్యూరిటీ కోరకుండా రుణాలు అందించాలని బ్యాంకర్లను కోరారు. మండల స్థాయిలో జరిగే జెఎల్బిసి సమా వేశాలకు సంబంధిత బ్యాంకుల మేనేజర్లు తప్పని సరిగా హాజరు కావాలని జాయింట్ కలెక్టర్ కోరా రు. సమావేశంలో పాల్గొన్న ఎంఎల్సీ కర్రి పద్మశ్రీ విశ్వకర్మ యోజన ద్వారా పూలదండల వ్యాపారులకు రుణా లు కల్పించాలని బ్యాంకర్లను కోరారు. ఈ సమావేశంలో ఎల్డియం సిహెచ్ఎస్వి ప్రసాద్, రిజర్వుబ్యాంకు ఎల్డిఓ పూర్ణిమ, నాబార్డు ఎజియం సోమునాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకట్రావు, వ్యవసాయ, అనుబంధ రంగ శాఖల పరిశ్రమలు, సంక్షేమ శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

24,25తేదీలలో బ్యాంకు ఉద్యోగుల సమ్మె

విశాలాంధ్ర - ఏలూరు: దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు ఈ నెల 24,25 తేదీలలో సమ్మె చేస్తున్నట్లు ఏలూరు జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం అధ్యక్షులు డి. శ్రీనివాస్ మోహన్ తెలిపారు. ఈనెల 24,25 తేదీలలో జరుగు సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక ఎస్.బి.ఐ. ప్రధాన కార్యాలయం వద్ద బ్యాంకు ఉద్యోగులు యు.ఎఫ్.బి. యు.ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మోహన్ మాట్లాడుతూ బ్యాంకులలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, వారానికి ఐదు రోజులు పని దినాలు కల్పించి, తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అవుట్సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని, ఐబీఏ తో చేసుకున్న ఒప్పందం ప్రకారం మిగిలిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని,కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు వలే గ్రాట్యూటీ రూ.25లక్షలకు పెంచి ఆదాయపు పన్ను రాయితీ ఇవ్వాలని,బ్యాంక్ ఉద్యోగులపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏ.ఐ.బి.ఈ.ఏ. నాయకులు ఎన్ లక్ష్మణరావు,ఏ. ఐ.బి.ఓ.సి. నాయకులు శ్రీనివాస్,ఎన్.సి. బి.ఇ.నాయకులు రత్న విమల్, రిటైర్డ్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కే.జే. సత్యనారాయణ,వంకినేని కిషోర్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఏలూరు నగరంలోని వివిధ బ్యాంకుల నుంచి ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు కూడా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోలీసుల ఆర్థిక సహకారానికి కోఆపరేటివ్ సొసైటీ దోహదం : ఎస్పీ కిషోర్

- సొసైటీ రుణాల పరిమితి రూ.5 లక్షలకు పెంపు

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : జిల్లాలో పని చేస్తున్న పోలీసుల ఆర్థిక సహకారానికి పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంత గానో దోహదపడుతుందని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ చెప్పారు. ఇప్పటివరకు ఈ సొసైటీలో రూ.3 లక్షల వరకు మాత్రమే రుణాలు అందించగా దానిని రూ.5 లక్షలకు పెంచినట్లు ఎస్పి ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏలూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏలూరు జిల్లా పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీలో రుణాలు పెంపుదల వల్ల ఆర్థికంగా పోలీసు సిబ్బందికి మరింత సహకారం అందించినట్లు అవుతుందని సొసైటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ శివ కిషోర్ సూచిస్తూ, పోలీసు సిబ్బందికి ఆర్థిక భరోసా కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. రుణ మంజూరుకు సంబంధించిన వివరాలకు సంబం ధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎస్పీని కలిసిన వారిలో ఏలూరు జిల్లా ఏఆర్ డిఎస్పీ చంద్రశేఖర్, ఎస్పి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు, ఆర్ఐ పవన్ కుమార్, పోలీస్ కో-ఆపరేటివ్ సెక్రెటరీ శ్రీనివాసరావు, శాసం రమేష్ బాబు, రామ్ తదితరులు ఉన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - బుట్టాయి గూడెం: సైబర్ మోసాలపై యువత అవగాహన కలిగి ఉండాలని బుట్టాయిగూడెం ఎస్ఐ దుర్గ మహేశ్వర రావు తెలిపారు. మండల కేంద్రంలోని బూసి రాజుపల్లి బాలికల గురుకుల పాఠశాలలో, స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూని యర్ కళాశాలల్లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, సైబర్ నేరాల గురించి చిట్టి వ్యాన్ తో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమా జంలో యువతను ఆకర్షించే విధంగా అనేక మోసాలు జరుగుతున్నా యని వాటికి లోనవకుండా జాగ్రతపడలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల సిబ్బంది, మహిళా కానిస్టేబుల్ కమల ఉన్నారు.

బందోబస్తు ఏర్పాట్లును పరిశీలించిన ఐజీ

విశాలాంధ్ర - పిఠాపురం : మండలంలోని చిత్రాడ గ్రామంలో ఈనెల 14వ తేదీన జరుగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ బహిరంగ సభకు బందోబస్తు ఏర్పాట్లును ఏలూరు రేంజ్ ఐజిపి జివిజి అశోక్ కుమార్ పరిశీలించారు. సభకు పెద్ద ఎత్తున జనసేన కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ప్రజలకు శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యలు, ఎలాంటి ఇబ్బందులు పడకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సభకు వచ్చే కార్యకర్తలకు, స్థానిక ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లించి, ఆర్టీసీ బస్సులు ప్రయాణించే మార్గాన్ని ముందుగా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాకి నాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, అదనపు ఎస్పీలు భాస్కర్, శ్రీనివాస్, ఎఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఇతర అధికారులు ఉన్నారు.

సుబ్బారెడ్డి సాగర్ ప్రధాన కాలువకు తాత్కాలిక మరమ్మత్తులు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని ఈ గోకవరం దగ్గర మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్ ప్రధాన కాలువకు గండి పడిందని సాగర్ చైర్మన్ ఇళ్ల అప్పారావు తెలియజేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ప్రాజెక్టును ప్రధాన కాలువ గండిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. సాగునీటి అధికారులతో మాట్లాడి గండి పడిన ప్రదేశాన్ని తాత్కాలికంగా ఇసుక మూటలు, మట్టితో మూయించారు. ఈ సీజన్ రబీ పంట అనంతరం ప్రధాన కాలువకు శాశ్వత గోడ కట్టేవిధంగా ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభకు తెలిపి సమస్య పరిష్కారంకు చర్యలు తీసుంటామన్నారు.